ప్రజాశక్తి

మంగళవారం 1 అక్టోబర్ 2024 | 5 | అనంతపురం

ధర్నాలో ప్రసంగిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

# 25 శాతం సబ్సిడీతో రబీ విత్తనం

**అక్టోబర్ నుంచి రబీ ప్రారంభం అవుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం రబీకి సంబంధించి విత్తన ధరలను నిర్ణయించింది. దీంతో సబ్సిడీని ఖరారు చేసింది. రబీలో అనంతపురం జిల్లాలో అత్యధికంగా సాగయ్యేది పప్పుశనగ పంట. దీనికి సంబంధించి విత్తన కేటాయింపులతోపాటు సబ్సిడీని 25 శాతం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.**

◆ 'అనంత'కు 27,139 క్వింటాళ్లు,

◆ సత్యసాయి జిల్లాకు 1143 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రబీలో సాధారణంగా రెండు లక్షల ఎకరాల్లో పప్పుశనగ పంట సాగవుతుంది. అందులో అత్యధికంగా అనంతపురం జిల్లా పరిధిలోని నల్లరేగడి భూములున్న ప్రాంతాల్లో పప్పుశనగ పంటను రైతులు సాగు చేస్తారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఈ ఏడాది 27,139 క్వింటాళ్ల సబ్సిడీ పప్పుశనగను కేటాయించగా, సత్యసాయి జిల్లాకు 1143 క్వింటాళ్లు కేటాయించింది. ఈ మేరకు పప్పుశనగ అవసరమైన రైతులు క్రిషీ యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తరువాత నాన్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించాక రైతులకు విత్తనాన్ని అందజేస్తారు.

**25 శాతం సబ్సిడీ**

రబీలో రెండు రకాలైన పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందులో జెజి-11 రకం ఒకటి కాగా, కాబులి రకంగా మరోకటి. జెజి-11 రకం పూర్తి ధర క్వింటాళు రూ.94 వేలు కాగా, సబ్సిడీ 25 శాతం రూ.2350 పోనూ రైతు చెల్లించాల్సింది రూ.7050 ఉంటుంది. కాబూలి రకమైతే క్వింటా పూర్తి ధర రూ.12,100 కాగా సబ్సిడీ రూ.3025 పోనూ రూ.9075 రైతు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్టీ రైతులకైతే 90 శాతం సబ్సిడీతో అందివ్వనున్నారు. ఈ విత్తనాలు 20 కిలోలు ఒక ప్యాకెట్ వస్తాయి. వీటిని అర ఎకరంలోపు ఉంటే ఒక బస్తా ఇస్తారు. ఎకరాలోపుంటే రెండు బస్తాలు, ఒకటిపైన ఒకటిన్నర ఎకరా వరకు భూమి ఉన్నరైతులకు బస్తాలు, రెండు ఎకరాల్లోపు ఉంటే నాలుగు బస్తాలు, రెండున్నర వరకుంటే ఐదు, మూడు ఎకరాలుంటే ఆరు బస్తాలు, మూడున్నర ఎకరా ఉంటే ఏడు బస్తాలు, నాలుగున్నర వరకుంటే ఎనిమిది, ఐదు ఎకరాల వరకుంటే పది బస్తాల వరకు గరిష్టంగా ఇస్తారు.

## కాంట్రాక్టు ఉద్యోగ, కార్మికులపై నిర్లక్ష్యం

◆ రెగ్యులర్ చేసి, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి

◆ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులపై ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోందని, ఈ విధానానికి స్వస్తి చెప్పి వారందరినీ రెగ్యులర్ చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అంతకు మునుపు లలితకళా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం. నాగమణి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఓబులు, ఎస్.నాగేంద్ర కుమార్‌లు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, నాన్ పర్మినెంట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కార్మికులకు డిస్పూట్(ఐడి) చట్టప్రకారం 240 రోజులు పనిచేసిన కార్మికులను పర్మినెంట్ చేయాలని సుప్రీంకోర్టు, కార్మిక చట్టాల చెబుతున్నాయన్నారు. అయినా కాంట్రాక్టు, డైలీవేజ్, కంటింజెంట్, అవుట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, పార్ట్‌టైం, గెస్ట్, పీస్ రేటు తదితర పేర్లతో నాన్ పర్మినెంట్ కార్మికులను పని చేయించుకోవడమే కాకుండా, కార్మిక హక్కులను కాలరాస్తున్నా పాలకవర్గాలు ఏమీ ఆలోచించడం లేదన్నారు. పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎనిమిది నెలలు గడుస్తున్నా వేతనాల అందకపోవడం సిగ్గుచేటు అన్నారు. జిల్లా వ్యాప్తంగా శ్రీరామ్ రెడ్డి, సత్యసాయి వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఎనిమిది నెలలు బకాయి, గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 15 నెలలకుపైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇలాంటి వారి పట్ల ప్రభుత్వాలు, పాలక ప్రజా ప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనాన్ని కేంద్రం, రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మెరుగైన జీవితాలకై పోరాడటం మినహా మరొక మార్గం కనపడటంలేదన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో డిఆర్ఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి టి.గోపాల్, ఉపాధ్యక్షులు మన్నెల రామాంజనేయులు, వెంకట నారాయణ, నాయకులు శివప్రసాద్, శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనరసమ్మ, ఎం.వరలక్ష్మి, ఎటిఎం నాగరాజ్, ఎర్రిస్వామి, తిరుమలేష్, శ్రీరామ్ రెడ్డి, శ్రీ సత్యసాయి తాగునీటి కార్మిక సంఘం నాయకులు ఎర్రిస్వామి, రాముడు, నేషనల్ హెల్త్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మెడికల్ కాలేజ్ నాయకులు ఓబులేష్, శేషు, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు బాషా, వీరాంజనేయులు, రైతుసంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బాల రంగయ్యతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోండి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పొలం పంటకు పిచికారీ చేస్తున్న సమయంలో పొరపాటున విషవాయువు పీల్చి మతి చెందిన కౌలు రైతు అజయ్ కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరంగయ్య, రంగారెడ్డి, కనేకల్లు మండల కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన కణేకల్లు మండలం మాల్యాం గ్రామంలో కౌలు రైతు విజయకుమార్ పొలంలో పంటకు పిచికారీ చేస్తూ విషవాయువు పీల్చి మృతి చెందాడని చెప్పారు. మృతునికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారని, ప్రభుత్వం స్పందించి ఈ కుటుంబానికి రూ.10లక్షల రూపాయలు ఎక్‌గ్రేషియాయా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఇళ్లుతో పాటు మృతుని పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.

**ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాల్లో రోస్టర్ విధానం పాటించాలి**

జిల్లాలో భర్తీ చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టుల నియామకల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రోస్టర్ విధానం పాటించి భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఒ రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్‌అసిస్టెంట్ల భర్తీల్లో ఎస్సీ ఎస్టీ రోస్టర్ విధానం పాటించడం లేదన్నారు. జిల్లా యంత్రాంగం పరిశీలించి దీనిని అమలు చేయాలని కోరారు.

## మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై పోరుబాట

### డిఇఒతో యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారంపై పోరుబాటకు సిద్ధం అవుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య తెలిపారు. సోమవారం యూటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మిని కలిసి ఉపాధ్యాయ సమస్యలపై చేపడుతున్న ఉద్యమానికి సంబంధించిన నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి సుమారు 10 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపల్ టీచర్లకు వర్తించక పోవడం అన్యాయమన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3,4,5 తరగతులను విలీనం చేశారు తప్పా, ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్‌లను ఇవ్వలేదన్నారు. ఉద్యోగోన్నతులు, బదిలీలు కూడా పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ ప్రభుత్వ, పంచాయతీ రాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంయుఓ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 2న మున్సిపాలిటీల్లో సత్యాగ్రహ దీక్ష, 17న డిఇఒ కార్యాలయాల వద్ద సత్యాగ్రహ దీక్ష, అక్టోబర్ 24న డైరెక్టరేట్ వద్ద 24 గంటల ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, వివిధ మండలాల నాయకులు కొండప్ప, చంద్రమోహన్, సిద్దన్న పాల్గొన్నారు.

తాను గీసిన చిత్రాన్ని కలెక్టర్‌కు అందిస్తున్న విద్యార్థిని నవ్యశ్రీ

## పెన్సిల్‌తో కలెక్టర్ చిత్రం

### 10వ తరగతి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యార్థిని పెన్సిల్‌తో గీసిన కలెక్టర్ చిత్రం

రాయదుర్గం పట్టణం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని పి.నవ్యశ్రీ జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ చిత్రపటాన్ని పెన్సిల్‌తో గీసింది. ఈ చిత్రాన్ని కలెక్టర్‌కు అనంతపురంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద డీఆర్డీఏ-వెలుగు కార్యాలయం పీడీ ఛాంబర్ సోమవారం అందించింది. విద్యార్థిని పెన్సిల్‌తో గీసిన తన చిత్రపటాన్ని చూసిన కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బొమ్మ బాగా ఉందని, భవిష్యత్తులో ఉన్నతంగా చదువుకోవాలని విద్యార్థినికి కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా బాలిక మాట్లాడుతూ పెన్సిల్‌తో బొమ్మలు గీయడాన్ని నేర్చుకుంటున్నానని, అందులో భాగంగానే కలెక్టర్ చిత్రపటాన్ని గీశానన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి, రాయదుర్గం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రద, టీచర్ భాగ్యలక్ష్మి, బాలిక తల్లిదండ్రులు వెంకటేశ్వరి, నరసింహులు పాల్గొన్నారు.

## నేడు బొప్పేపల్లికి కలెక్టర్ రాక

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని బొప్పేపల్లి గ్రామనికి కలెక్టర్ వినోద్ కుమార్ మంగళవారం రానున్నారని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు. బొప్పేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ అధికారిని ఉమా మహేశ్వరమ్మ, మండల ప్రత్యేక అధికారి రఘునాథ్ రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

## చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-ప్రజాశక్తి

సివిల్ రైట్స్‌డేలో భాగంగా సోమవారం మండల పరిధిలోని వేములపల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, ఆర్ఐ నారాయణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్యూటీ తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-యల్లనూరు

మండల డిప్యూటీ తహశీల్దార్‌గా మహబూబ్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపప్పూరు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శ్వేత పెద్దపప్పూరుకు బదిలీ అయ్యారు.

## ఇన్‌ఛార్జి ఆర్‌డిఓగా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి ఆర్‌డిఓగా అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత ఉద్యోగోన్నతి బదిలీపై సబ్ కలెక్టర్‌గా విశాఖపట్నం జిల్లాకు వెళ్లారు. అసిస్టెంట్ కలెక్టర్ వినుత్న మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి సత్వ రమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బాధ్యతల స్వీకరణ అనంతరం మాట్లాడుతున్న వినూత్న

## నూతన మద్యంపాలసీ నష్టదాయకం

◆ ప్రభుత్వం అధీనంలోనే మద్యం షాపులు నిర్వహించాలి ◆ కలెక్టర్‌కు మహిళా సంఘాల జేపీసీ వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళా సంఘాల జెసి నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 1వ తేదీ నుంచి అమలు చేయబోతున్న నూతన మద్యం పాలసీ సమాజానికి మరింత నష్టదాయకం అని మహిళా సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. నూతన మద్యం పాలసీని రద్దు చేసి, ప్రభుత్వమే నాణ్యమైన మద్యాన్ని విక్రయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాడు అనంతపురం డిఆర్‌డిఎ కార్యాలయంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల జెఎసి నాయకులు వి.సావిత్రి, పార్వతీ ప్రసాద్, సరస్వతి మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ అమలైతే ప్రయివేటు వ్యక్తులు చేతుల్లోకి మద్యం అమ్మకాలు వెళ్తాయన్నారు. వారు లాభాపేక్షతో విచ్చలవిడి మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తారన్నారు. నూతన మద్యం పాలసీలో మద్యం విక్రయాల సమయం కూడా పెంచడం సరికాదన్నారు. రాత్రిళ్లు మద్యం విక్రయాలు చేయడం ద్వారా మద్యం సేవించి మహిళలు ఆడపిల్లలపై అత్యాచారం, అఘాయిత్యాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాల వల్ల చిన్నపిల్లలు సైతం మద్యం సేవించి జీవితాలను నాశనం చేసుకుంటూ, ఇతరుల జీవితాలనూ నాశనం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి మద్యాన్ని నియంత్రించాలన్నారు. మద్యం షాపులను ప్రభుత్వం ఆధీనంలోనే నిర్వహించాలన్నారు. ఆధార్ కార్డు ఆధారంగా మద్యం విక్రయాలు జరపాలన్నారు. 20 సంవత్సరాల్లోపు పిల్లలు వస్తే మద్యం విక్రయించరాదన్నారు. గుడి, బడి ఉన్న ప్రదేశాలు ప్రజల ఆవాసా కేంద్రాల్లో మద్యం షాపులు నిర్వహించరాదన్నారు. మద్యానికి బానిసై మతిచెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని అన్నారు. సంపూర్ణ మద్యపానం నిషేధించకపోయినా, నియంత్రణ చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే దశలవారి పోరాటాలకు శ్రీకారం చుడదామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల జేఏసీ నాయకులు చంద్రిక, రామాంజినమ్మ, అరుణమ్మ, సరస్వతి, అనిత, లక్ష్మీదేవి, చంద్రకళ పాల్గొన్నారు.

## జవాబుదారీతనంతో పోలీసు విధులు : ఎస్పీ

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పోలీసులు విధులు పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. సోమవారం నాడు జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఎస్ఐలు, ఆపైస్థాయి పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్ కేసుల్లో తప్పనిసరిగా నిందితులకు శిక్షలు పడేలా చర్యలుండాలన్నారు. ప్రతీ పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ జిడిలు తప్పనిసరిగా రాయాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో చిన్న సమస్యలు సైతం తలెత్తకుండా అప్రమత్తంగా పని చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సిసి కెమెరాల సేవలు చాలా కీలకమన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు, రవికుమార్, శ్రీనివాస్, రామకృష్ణుడు, ఎస్.మహబూబ్ బాషాతో పాటు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

**పలువురికి ప్రశంసా పత్రాలు**

గత నెలలో జిల్లా వ్యాప్తంగా మంచి పని తీరు కనపరిచిన 46 మంది పోలీసులను ఎస్పీ అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. నిందితులను సకాలంలో కోర్టు ముందు హాజరు పరిచి రెండు జీవిత కాలాల శిక్షలు పడేలా కృషి చేయడం ఇతర కేసుల్లో పురోగతి చూపిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. సిఐలు ఇస్మాయిల్, సాయినాథ్, శాంతిలాల్, ప్రతాప్ రెడ్డి, షేక్ జాకీర్, ఎస్ఐలు నాగమధు, సాగర్, గౌస్ మహమ్మద్ బాషా, పవన్ కుమార్, రాజశేఖర్ రెడ్డితో పాటు ఎఎస్ఐలు, సిబ్బందికి అందించారు.

## కందికాపుల సర్పంచికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి-పుట్లూరు

సర్పంచి శివరామయ్య

దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబర్ 2వ తేదీ జరిగే స్వచ్ఛత మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 8 మంది సర్పంచులకు ఆహ్వానం అందింది. అందులో మండలంలోని కందికాపుల సర్పంచి శివరామయ్యకు ఆహ్వానం అందింది. దీంతో శివరామయ్యను జిల్లాలోని సర్పంచులు, మండల నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, రవికుమార్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, గోవర్ధనరాజు, తదితరులు అభినందించారు.

## గ్రామసభల సమాచారం ముందస్తుగా తెలపండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామసభల సమాచారాన్ని ముందస్తుగా ఆయా గ్రామాల ప్రజలకు తెలియజేయాలని ప్రజా స్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపిడిఒ తేజోష్ణ్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 791 జీవో ప్రకారం గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలను ప్రజలకు ముందస్తుగా దండోరా ద్వారా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్, కోశాధికారి టివి.రెడ్డి, సహాయ కార్యదర్శి కెఎల్ఎం.ప్రసాద్, సామాజిక కార్యకర్త రామకృష్ణ పాల్గొన్నారు.

సీడాఫ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దీపక్‌రెడ్డి

## దీపక్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాయదుర్గం

సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రపదేశ్(సి ఎపి) ఛైర్మన్‌గా టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గుణపాటి దీపక్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని సీడ్ ఎపి కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ అధికారి దీపక్‌రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి అధినాయకులు, సిఎం చంద్రబాబు తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తారని తెలిపారు. నియోజకవర్గానికి చెందిన నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగనమల



ఆసుపత్రిలో జనరేటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలిపారు. ఎమ్మెల్యే సోమవారం శింగనమలలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓపి, మందులు, తదితర గదులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఆర్భాటం తప్ప చేసిందేమీ లేదన్నారు. 2014-19 మధ్య అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో గర్భిణులకు డెలివరీ అయిన తర్వాత ఎన్టీఆర్ బేబీ కిట్లు పంపిణీ చేసే వారన్నారు. వైసిపి పాలనలో ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారన్నారు. ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా లేనప్పుడు వైద్యులు, సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జనరేటర్‌కు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తెచ్చామన్నారు. అనంతరం ఆమె ఆసుపత్రి మొత్తం కలియతిరిగి రికార్డులు పరిశీలించారు. రాత్రివేళ అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం మండం సుధాకర్ యాదవ్ కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. డ్రెయినేజీ కాలువలను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు నిలపాలని తెలిపారు. శింగనమలను అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఉపాధి హామీకి సంబంధించి గడ్డపారలు, తదితర పనిముట్లపై ఈఓఆర్‌డి మురళీకృష్ణని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలకుమారి, ఈఓఆర్‌డి మురళీకృష్ణ, మాజీ జడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, టిడిపి మండల కన్వీనర్ చిదంబరిదొర, చిదానందనాయుడు, బోయ సత్తి, మసూద్‌వలి, డ్రిప్ ఓబులేసు, ఎం.ఆదినారాయణ, బండి వెంకటనారాయణ, ఆటో అంజి, కాయల రాజశేఖర్‌యాదవ్, కాయల సురేష్‌యాదవ్, కాయగూరల సత్తి, చాకలి వెంకటేష్, నాగముని, అనిల్‌కుమార్, పెద్దన్న, లక్ష్మయ్య, కంబయ్య, ముంతా వెంకటేష్, గుర్రం లక్ష్మీనారాయణ, వీఆర్వో తాతయ్య, రామాంజనేయులు, ఆర్టీసీ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో అర్జీలకు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు న్యాయమైన పరిష్కారం చూపించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. నగరంలోని ఆర్డీవో కార్యాలయం డీఆర్డీఏ- వెలుగు కార్యాలయంలో అనంతపురం రెవెన్యూ డివిజన్ స్థాయి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్నతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి 205 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న మండల స్థాయి అర్జీలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్, ఆర్డీవో, తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజలకు అవసరమైన 100 ముఖ్యమైన సర్వీస్‌లకు సంబంధించిన బోర్డులను ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, డీఆర్డీఏ పీడీ, జెడ్పీ సిఇఒ ఓబులమ్మతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల తొలగింపుపై ధర్నా

రాస్తారోకో నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

దళిత మున్సిపల్ కార్మికులను విధుల నుంచి తొలగించడంలో మున్సిపల్ కమిషనర్ వైఖరిని ఖండిస్తూ సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మున్సిపాలిటీలో పదేళ్లుగా పది మంది దళిత కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుని ఇప్పుడు అన్యాయంగా తొలగించడం ఏంటని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణను ప్రశ్నించారు. దళిత, గిరిజన కార్మికుల పట్ల వివక్ష చూపితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి కమిషనర్, కూటమి రాజకీయ నాయకులకు తగిన బుద్ధి చెబుతామన్నారు. ధర్నాలో జెఎసి నాయకులు చెలిమప్ప, తాలూకా అధ్యక్షులు, జిల్లా నాయకులు దొన తిమ్మప్ప, డాబా రమేష్, భాస్కర్ నాయక్, శీర్పి గంగప్ప, గోపాల్, రామచంద్ర, నరసింహులు, శ్రీరాములు, లక్ష్మీదేవి, వేదావతి, బాలు, శివ, తదితరులు పాల్గొన్నారు.

# పామిడిలో సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి ఇస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-పామిడి**

పామిడి పట్టణంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మకు ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కుమారస్వామి, దళిత సంఘం సీనియర్ నాయకుడు మల్లికార్జున మాట్లాడుతూ పామిడి నగర పంచాయతీని గ్రామపంచాయ తీగా మార్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలు, ఉపాధి హామీ, బిఆర్‌జిఎఫ్, కొన్ని ఫైనాన్స్ ప్రణాళికలు రాక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. దీంతో పేదలు ఉపాధి లేక వలస పోతున్నారన్నారు. పామిడి గ్రామపంచాయతీలో 30వేల జనాభా ఉండగా 10వేల జాబ్ కార్డుల అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పామిడి వద్ద పెన్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందన్నారు. అనధికార వెంచర్లు వేసి గ్రామపంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. ఈ విషయంలో స్థానిక అధికారులు విఫలమయ్యారన్నారు. ఆయా అంశాలపై స్పందనలో పలుమార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# ముందస్తు సమాచారం ఇస్తేనే ప్రయోజనం

కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి ఇస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-నార్పల**

మండల వ్యాప్తంగా నిర్వహించే గ్రామసభల సమాచారాన్ని ముందుగా తెలియజేయాలని కోరుతూ సోమవారం ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎంపిడిఒ దివాకర్‌కు వినతి పత్రం అందజేశారు. వేదిక సభ్యులు మాట్లాడుతూ గ్రామ సభల గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు ముందుగా దండోరా ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ప్రజల సమస్యలు గుర్తించి పరిష్కరించాలని కోరారు. ఒక్కో గ్రామంలో ఒక్కో రోజు గ్రామసభ నిర్వహించి సమస్యలు గుర్తించి పరిష్కరించాలని, గ్రామ సభలకు అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో వేదిక జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్, కోశాధికారి టీవీ రెడ్డి, సహాయ కార్యదర్శి ప్రసాద్, సామాజిక కార్యకర్త రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

# లో వోల్టేజీ సమస్యతో రైతులకు ఇబ్బందులు

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

మండలంలోని దర్గాహొన్నూరు పరిధిలో 900 విద్యుత్ మోటార్ల సర్వీసులు ఉన్నాయి. ఈ సర్వీస్‌లకు త్రీఫేస్ అయినా సింగల్ ఫేస్ విద్యుత్ అయినా ఓబుళాపురం నుంచి సరఫరా తీసుకుంటున్నారు. లోవోల్టేజీ సమస్యతో వారం రోజుల నుంచి 8 ట్రాన్స్‌ఫార్మర్లు, 10 విద్యుత్ మోటార్లు కాలిపోయి రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. లోవోల్టేజీ సమస్యను పలుమార్లు విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి లో వోల్టేజీ సమస్యను పరిష్కరించి వ్యవసాయానికి 9 గంటల పాటు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. లో వోల్టేజీ సమస్యపై విద్యుత్ అధికారి లక్ష్మిరెడ్డిని వివరణ కోరగా కొంతకాలంగా లో వోల్టేజీ సమస్య ఉందన్నారు. విద్యుత్ మోటార్ల సంఖ్య పెరిగిపోవడమే అందుకు కారణమన్నారు. త్వరలో అక్రమ మోటార్లను తొలగించి రైతులకు సకాలంలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ శరత్‌చంద్ర

## శింగనమల ఎస్ఐగా శరత్‌చంద్ర

**ప్రజాశక్తి-శింగనమల**

మండల నూతన ఎస్ఐగా శరత్‌చంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న చంద్రశేఖర్ నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న శరత్‌చంద్ర బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన శిక్ష తప్పదన్నారు. ముఖ్యంగా పేకాట, మట్కా, జూదం, తదితర అసాంఘిక కార్యకలాపాల గురించి తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారైనా కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని నూతన ఎస్ఐ హెచ్చరించారు.

# జిల్లా స్థాయిలో పిల్లలమర్రి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఎంఇఒ శ్రీధర్, హెచ్‌ఎం అశోక్

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

మండలంలోని పిల్లలపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థినులు వి.సమత, ఎన్.గంగోత్రి స్వర్ణాంధ్రప్రదేశ్-2047 జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు చర్చ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చర్చ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి డిఇఒ వరలక్ష్మి నుంచి ప్రశంసాపత్రం, బహుమతులు అందుకున్నారు. ఆ విద్యార్థులను సోమవారం హెచ్‌ఎం అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం సన్మానించారు. అలాగే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 8వ తరగతి విద్యార్థులకు శెట్టూరు ఎంఇఒ శ్రీధర్ చొరవతో మెటీరియల్ పంపిణీ చేశారు. దీంతో ఎంఇఒ శ్రీధర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, గీతావాణి, హేమావతి, రామాంజనేయులు, చిన్నవన్నప్ప, గోవిందరెడ్డి, సరళకుమారి, సుధాబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు విద్యార్థుల విరాళం

**ప్రజాశక్తి-ఉరవకొండ**

విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక జడ్పీ సెంట్రల్ హైస్కూల్ విద్యార్థులు విరాళాలు సేకరించి సోమవారం తహశీల్దార్ మహబూబ్‌బాషాకు అందజేశారు. చిన్న వయసులోనే సేవాభావంతో ఆపదలో ఉన్న వారికి సహాయపడాలనే మంచి ఆలోచనలతో విరాళాలు సేకరించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు, ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కుమారుడు కాలవ భరత్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య, ఎంఇఒ వెంకటరమేష్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మారుతి, టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, వైసిపి వార్డు ఇన్‌ఛార్జి శివ, నిజాముద్దీన్, కో ఆప్షన్ మెంబర్ నజీర్, పీఈటీలు, కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప

# నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**

పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నిత్యావసర వస్తువుల ధరలను నియంత్ర చేస్తామని హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఇష్టారాజ్యంగా ధరలను పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. క్రూడ్ ఆయిల్ ధర తగ్గిన ప్పటికీ వంట నూనె ధరలు అమాంతంగా పెంచారన్నారు. అలాగే రోజూ ప్రజలు వాడుతున్న నిత్యావసర వస్తువుల ధరలు కూడా అమాంతం పెంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు జ్ఞానమూర్తి, మురళి, వీరాంజనేయులు, రవికుమార్, హనుమంతు, శ్రీనివాసులు, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెద్దపప్పూరులో అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ అధికారిణులు

**ప్రజాశక్తి-పెద్దపప్పూరు**

గర్భిణులు, బాలింతలు బలమైన ఆహారం తీసుకోవడం ద్వారా పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఈవోఆర్డీ కమలబాయ్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఐసిడి ఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈవోఆర్డీ కమలబాయ్, సూపర్వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మి హాజరై చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఒకేషనల్ టీచర్ శశికళ నేర్పించిన కళలను కెజిబివి విద్యార్థినులు ప్రదర్శించారు. తక్కువ ఖర్చుతో ఇంటిని ఎలా అలంకరించుకోవచ్చు, ఇంటిని అందంగా ఉంచుకోవడానికి కావాల్సిన వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. ఏ వస్తువు నిరుపయోగం కాదని ఆలోచిస్తే ప్రతి వస్తువు ఒక మంచి కళాకృతిగా తయారు చేయవచ్చని టీచర్ శశికళ తెలిపారు.

**నార్పల :** మహిళలు ఆకుకూరలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు వంటి సమతుల ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ మధుమాలిని తెలిపారు. మండలంలోని తుంపెర, మాలవాండ్లపల్లి, సిద్ధరాచర్ల గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్లో సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సూపర్వైజర్ మధుమాలిని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఎస్.మంజుల, రాధమ్మ, సువర్ణ, ఎస్‌ఆర్పీ సరస్వతి, ఎమ్మెస్ కె.జయలక్ష్మి, ఆశా వర్కర్ ఈశ్వరమ్మ, ఎడబ్ల్యుహెచ్ గంగమ్మ పాల్గొన్నారు.

**రవకొండ :** పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి శివశంకర్ నాయక్ తెలిపారు. విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఎంపిహెచ్ఒ మధు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు దుర్గాదేవి, మల్లేశ్వరి, రాధా, నాగవేణి, ఈరమ్మ, లక్ష్మీదేవి, ఆదిలక్ష్మి, ఆయాలు, ఆశా ఆరోగ్య కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

# పౌర హక్కులపై అవగాహన

బెళుగుప్పలో పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

బాల్య వివాహాలను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తహశీల్దార్ షర్మిల, ఎస్ఐ శివ తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్నతనంలో వివాహం చేస్తే జరిగే అనర్థాలను వివరించారు. యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంగడి శ్రీరాములు, సూర్యనారాయణ, నారాయణస్వామి, తిప్పేస్వామి ఎస్సీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

**బ్రహ్మసముద్రం :** దళితుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు తెలిపారు. మండలంలోని గొంచిరెడ్డిపల్లి గ్రామ దళిత కాలనీలో సోమవారం 'సివిల్ రైట్స్ డే' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహశీల్దార్ సుమతి, సర్పంచి అంజనప్ప, మాజీ ఎంపీపీ మంజుల వన్నూరుస్వామి హాజరై మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరూ సమానమే అన్నారు. కుల మత బేధాలు లేకుండా కలిసిమెలిసి సోదర భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో మద్రిస్వామి, పంచాయతీ కార్యదర్శి కవిత, ఎస్సీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, జమేదారు ఎర్రిస్వామి, అంగన్వాడీ కార్యకర్త తిప్పేరమ్మ, నాయకులు పిల్లలపల్లి రాము, శీనప్ప, మల్లి, శివయాదవ్, డీలర్ లచ్చన్న, దొణతిమ్మప్ప, బోయ గోవిందు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పుట్లూరులో స్వచ్ఛ సేవపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పర్యావరణ ఇన్‌స్పెక్టర్ రాధిక లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని ఎస్‌విజిఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తడి, పొడి చెత్త సేకరణ తరలింపు విధానాలపై పట్టణంలోని అన్ని పురువీధుల్లో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. ర్యాలీలో ఎన్ఎస్ఎస్ పిఒ శ్రీధర్, రవిశంకర్ పాల్గొన్నారు.

**నార్పల :** స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఎంపిడిఒ దివాకర్, ఈఓఆర్‌డి శైలజరాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ పొడి చెత్త, తడి చెత్త వేర్వేరుగా ఉంచి పంచాయతీ కార్మికులకు అందించాలని మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. చెత్త కేంద్రాల ద్వారా సంపద సృష్టించడం, పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఉపసర్పంచి శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి చరణ్, పరశురాం, శ్రీనివాసులు, లక్ష్మేంద్ర, ఉపాధ్యాయులు రంగధామ, ఆంజనేయులు, కళ్యాణి, చెన్నకేశవ, దావూద్, హరినాథ్, రాజేశ్వరి, విద్యార్థులు, కార్మికులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ యోగానంద రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి ఫెస్ట్ నిర్వహించారు. ఇందులో భాగంగా వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్, కెజిబివి, జడ్పీహెచ్ఎస్, ఎపి మోడల్ స్కూల్ విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆనంద ప్రసాద్, ఎంఇఒ శ్రీదేవి, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి, కెజిబివి ఎస్ఒ మాధవి, సిబ్బంది, వెలుగు సీసీలు, యానిమేటర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

## సిఎంకు ఎమ్మెల్యే వినతి

**రాయదుర్గం :** పట్టణంలో అర్ధాంతరంగా ఆగిపోయిన రెండు రైల్వే వంతెనలను పూర్తి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సోమవారం అమరావతి సచివాలయంలో సిఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చారు. గత టిడిపి పాలనలో పట్టణ ప్రజల భవిష్యత్ అవసరాల దృష్ట్యా రెండు ప్లై ఓవర్లను మంజూరు చేసిన విషయాన్ని సిఎంకు గుర్తు చేశారు. వైసిపి హయాంలో రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయని కారణంగా ఐదేళ్లుగా ఆ వంతెనలు దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనైనా వీటికి నిధులు మంజూరు చేసి పనులను తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు.

## నేడు పింఛన్ల పంపిణీ

**అనంతపురం రూరల్ :** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం లో భాగంగా మంగళవారం అనంతపురం రూరల్ మండల వ్యాప్తంగా పంపిణీ చేస్తారని ఎంపి డిఒ పుల్లయ్య తెలిపారు. మొత్తం 25 గ్రామపంచాయతీల్లో 17,616 మంది లబ్ధిదారులకు రూ. 7,74,43,000 డ్రా చేశామన్నారు. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారని ఎంపిడిఒ తెలిపారు.

## శ్రీధర్‌చౌదరి, కేశవరెడ్డిని కలిసిన 'పోతుల'

శ్రీధర్‌చౌదరిని కలిసిన పోతుల లక్ష్మినరసింహులు

**ప్రజాశక్తి-అనంతపురం**

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డిలను సోమవారం వారి వారి నివాసాల్లో పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర సభ్యులు పోతుల లక్ష్మినరసింహులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల భర్తీలో మొదటి జాబితాలోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చోటు కల్పించడం ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు జానపాటి సత్యనారాయణ, దేవరకొండ నరసింహులు, పోతుల మంజునాథ్, నాయీబ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు కడియాల కొండ పాల్గొన్నారు.

## గొర్రెల కాపరికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి-గుత్తి**

మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన గొర్రెలకాపరికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం రాత్రి గొర్రెల మందపై పిడుగు పడి 16 గొర్రెలు మృతి చెందాయి. దీంతో గుమ్మనూరు నారాయణ చెర్లోపల్లి గ్రామానికి వెళ్లి మృతిచెందిన గొర్రెలను పరిశీలించి గొర్రెల కాపరికి రూ. 20వేలు అందజేశారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకాపరికి ఆర్థికసాయం అందజేస్తున్న గుమ్మనూరు నారాయణ

# నేరాలు ఘోరాలు

## పిడుగుపాటుకు మహిళ మృతి

**ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్**

మండలంలోని చదం గ్రామంలో సోమవారం పిడుగుపాటుకు గుర్రె గంగమ్మ(58) మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రోజు వారీ క్రమంలో సోమవారం గంగమ్మతో పాటు మరో ముగ్గురు వ్యవసాయ పనులకు వెళ్లారు. వారు పని చేసే సమయంలో వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు పడడంతో గంగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. చిట్టెమ్మకు తీవ్రంగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గంగమ్మ భర్త గతంలో మతిచెందగా ఇద్దరు కుమారులు బెంగళూరులో పని చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు సమాచారం.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మండలంలోని బుగ్గ గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కడప జిల్లా వెలిదండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై బుగ్గ నుంచి తాడిపత్రి వైపు వస్తుండగా తాడిపత్రి-నంద్యాల ప్రధాన రహదారిపై బుగ్గ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వారికి స్థానికులు 108 ద్వారా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. విచారణ చేపట్టారు.

## పేకాటజూదరులు అరెస్టు

**ప్రజాశక్తి-కుందుర్పి**

పేకాట స్థావరంపై సోమవారం ఇన్‌ఛార్జి ఎస్ఐ రాంభూపాల్ మెరుపు దాడులు చేపట్టారు. మండలంలోని ఏనుములదొడ్డి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులతో కలిసి మెరుపు దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకోగా ఒకరు పరారయ్యారు. వీరి నుంచి రూ. 23 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ప్రజలు సమాచారం ఇవ్వాలని, వాటిని అరికడతామని ఎస్ఐ తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వవరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## భక్తాంజనేయస్వామి మూలవిరాట్ చోరీ

**ప్రజాశక్తి-పామిడి**

పామిడి వద్ద పెన్నా నది మధ్య ప్రాంతంలో వెలసిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో ఉన్న భక్తాంజనేయస్వామి మూలవిరాట్‌ను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వారు ఆలయ తలుపులకు ఉన్న తాళం బద్దలు కొట్టి తవ్వి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ ధర్మకర్త షణ్ముఖ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయాన్ని 1938వ సంవత్సరంలో మా పూర్వీకులు నిర్మించారన్నారు. నేటికీ నిత్య పూజలు, కైంకర్యాలు జరుగుతున్నాయన్నారు. దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించాలని, మూలవిరాట్‌ను కనిపెట్టాలని కోరారు. అలాగే ఆలయాల పరిరక్షణకు నిఘా పెంచాలని కోరారు.

## ఇద్దరు బైండోవర్

**ప్రజాశక్తి-యల్లనూరు**

రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో రహదారి విషయంలో దాదుబాషా అనే వ్యక్తిని గాయపరచిన ఘటనలో సోమవారం ఇద్దరిని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ బాషా ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. ఇద్దరిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామప్రసాద్ తెలిపారు.

## ఆలయంలో అన్నదానం

**ప్రజాశక్తి-పుట్లూరు**

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం సమీపంలో సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయం అభివృద్ధికి దాతలు సహకరించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, ఎం.హరినాథ్‌రెడ్డి, బి.రామాంజనేయరెడ్డి, కుంద శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఓబన్న

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులుగా వెలిగొండ ఓబన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, డివిజన్ పరిధిలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాల్లో ఓబన్న చురుగ్గా పాల్గొని ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీ ఓబన్నను జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నిక చేసినట్లు తెలిపారు. ఓబన్న మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## ఈ క్రాప్ నమోదు పరిశీలన

ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో సరిత

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

మండలంలోని బ్రహ్మసముద్రం, వేపులపర్తి, బైరసముద్రం, తదితర రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ క్రాప్ బుకింగ్, ఈ క్రాప్ నమోదు ప్రక్రియను ఏవో సరిత పరిశీలించారు. ఆమె పలు సర్వే నెంబర్లలో సాగు చేసిన పంట పొలాల్లోకి వెళ్లి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 35,550 ఎకరాల్లో 9,631 మంది రైతులు ఈక్రాప్ బుకింగ్ చేసుకున్నారన్నారు. ఈకేవైసీ 90 శాతం పూర్తయిందన్నారు. ఏవో వెంట రైతు సేవా కేంద్రం సిబ్బంది ముజవీర్ బాషా, రామకృష్ణ, నాగేంద్ర, రైతులు ఉన్నారు

## బడి రుణం తీర్చుకుందాం

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1984-85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం అదే పాఠశాలలో 'బడి రుణం తీర్చుకుందాం' కార్యక్రమం నిర్వహించారు. రూ. 25 వేలు ఖర్చు చేసి పాఠశాల క్రీడా మైదానం చుట్టూ ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. పూర్వ విద్యార్థి, బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లు హెచ్‌ఎం పి.శ్రీనివాస్‌రెడ్డి రూ. 10 వేలు అందజేశారు. దీంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు. పూర్వ విద్యార్థుల చేయూతను హెచ్‌ఎం ఎం.వెంకటప్రసాద్, ఎస్ఎంసి ఛైర్మన్ రద్రయ్య, ఉపాధ్యాయుల బృందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ, రాజశేఖర్, ఇమాంసాబ్, శంకర్‌రెడ్డి, ఉమాశంకర్, రాజేశ్వరి, వనిత, తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

**ప్రజాశక్తి-గుత్తి**

ఐక్యంగా పోరాటాలు చేస్తేనే ప్రభుత్వాలపై వత్తిడి పెరిగి విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ తెలిపారు. పట్టణంలో సోమవారం ఎస్ఎఫ్ఐ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాలాజీ, ధనార్జనతో పాటు ఏడుగురు ఆఫీస్ బేరర్లు, 21 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఈశ్వర్, నవీన్‌యాదవ్, బాషా, కార్తీక్, నూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సి.రమేష్